559 కేసులు..

- 1358 మంది అరెస్టు..
- 338 కోళ్లు స్వాధీనం..
- రూ.9.29 లక్షలు సీజ్

ఏలూరు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోడిపందేలు, పేకాటలు, గుండాటలపై పోలీసులు ఈనెల 15వ తేదీ కనుమ పండుగ రోజు కూడా కేసులు నమోదు చేశారు. 68 పేకాట కేసులు, 93 కోడిపందేల కేసులు, 27 గుండాట కేసులు మొత్తం 188 కేసులను నమోదు చేశారు. 468 మందిని అరెస్టు చేసి వారి నుంచి మూడు లక్షల 53 వేల 130 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. 109 కోళ్ళు, 114 కోడి కత్తులు, 27 గుండాట బోర్డులను స్వాధీనం చేసుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా 13, 14, 15 తేదీల్లో జిల్లాలో కోడిపందేలు, పేకాటలు, గుండాటలపై మొత్తం 559 కేసులు నమోదు చేసి 1,358 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 9 లక్షల 29 వేల 325 రూపాయలు సీజ్ చేశారు. 338 కోళ్ళు, 380 కోడికత్తులు, 90 గుండాట బోర్డులను స్వాధీనం చేసుకున్నారు.



సంక్రాంతి బరిలో రారాజు నెమలి పుంజు

కలిదిండి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి బరిలో నెమలి రకం కోడిపుంజు రారాజుగా నిలిచింది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మూడు రోజులపాటు నిర్వహించిన భారీ కోడిపందేల్లో నెమలి కోడిపుంజు హవా కొనసాగింది. అన్ని రకాల పందేల్లో దీని జోరు కొనసాగింది. కలిదిండి మండలంలో నిర్వహించిన పందేల్లో నెమలి కోడిపుంజులే అధికశాతం గెలిచాయి. పందెపు రాయుళ్ల కూడా అధిక శాతం నెమలి కోడి పుంజులపై హెచ్చు పందెలు కట్టి లక్షలాది రూపాయలు గెలుచుకున్నారు. దీంతో ఈ రకానికి చెందిన కోడి పుంజులకు డిమాండ్ పెరిగింది.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి

కలిసికట్టుగా కదలాలి

జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

- కొల్లేరు, పోలవరం నిర్వాసితుల సమస్య తీరుద్దాం
- జిల్లాను పారిశ్రామిక ప్రగతి వైపు నడిపిద్దాం
- పనులు పూర్తి చేసే బాధ్యత అధికారులదే
- ఎక్కడ నిర్లక్ష్యం చేసినా సహించేదేలేదు

'ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు అందించిన ప్రతీ నిర్వాసితుడికి పూర్తి న్యాయం చేసేలా చర్యలు.. సమాంతరంగా కొల్లేరు పరిధిలోని సమస్యలను తీర్చడమే కాకుండా సమగ్ర సర్వేను ఒక కొలిక్కి తీసుకురావాలి.. జిల్లాను ఇప్పటివరకు ధాన్యాగారంగానే చూశాం. ఇక ముందు పారిశ్రామికంగా తీర్చి దిద్దేందుకు ఔత్సాహికులను ప్రోత్సహిద్దాం. వీటితోపాటు ప్రభుత్వ పరంగా అన్ని పనులను పూర్తి చేయాల్సిన బాధ్యతను సమష్టిగా తీసుకుందాం. అధికారులు చురుగ్గా వ్యవహరించాలి'.. అంటూ గురువారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశంలో నిర్ణయించారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్ఠను మరింత పెంచేలా కష్టపడి పని చేయాల్సిన బాధ్యత అందరిమీద ఉందని, ఈ అంశంలో అధికారుల పాత్ర కీలకంగా మారాలని పిలుపు నిచ్చారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో నిర్వాసితులు అందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి విధిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ఇప్పటికే గత ప్రభుత్వం వైఫల్యమైన విషయం చర్చకు వచ్చింది. ఈ విషయంలో అందరికీ న్యాయం చేసే దిశగా చర్యలకు దిగాలని మంత్రి ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరంలలో గ్రామసభలు ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి సొమ్ము అందించిన నిర్వాసితులను, వారికి మంజూరు చేసిన కాలనీలలోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొల్లేరు వాసులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను తెలుసుకుని వాటి నుంచి విముక్తి పొందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదని మంత్రి అన్నారు. కొల్లేరు ఐదో కాంటూరులో అటవీ, జిరాయితీ భూముల సరిహద్దుల నిర్ధారణకు అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో నిర్ధారించాలని, అందుకు సంబంధించిన మ్యాప్‌లను సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కొల్లేరులో 14 వేల ఎకరాల జిరాయితీ భూమిదారుల సమస్యలకు సంబంధించి సమగ్ర సమాచారంతో నివేదిక సిద్ధం చేయాలని నిర్ణయించారు. కొల్లేరు సమస్యలపై బడ్జెట్ సమావేశాల సమయంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి చర్చించాలని మరో నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేకించి కొల్లేరు విషయంలో ఇప్పుడున్న యథా తథ పరిస్థితిని సర్వేలో కొనసాగించాలనే వాదనలు సమావేశంలో చోటు చేసుకున్నాయి. కొల్లేరు పరిధిలో డ్రెయిన్‌లు పూడుకు పోయిన విషయాన్ని ఈ పూడికను తొలగించి నీటి సరఫరా సక్రమంగా చేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల జారీ చేశారు.

పారిశ్రామికంగా ఎదగాల్సిందే..

జిల్లాలో పారిశ్రామిక వెలుగులు నింపాలని, దీనికి అనుగుణంగా ఔత్సాహికులను ప్రోత్సహించాలని ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ డిమాండ్ చేయగా అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆధీనంలో ఉన్న భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్టుబడిదారులు జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేలా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక టీమ్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వచ్చే మార్చి 15 లోగా ఈ టీమ్ తగిన విధి విధానాలను రూపొందిస్తుందని, పరిశ్రమల ఏర్పాటుతో జిల్లాలో ఉద్యోగ అవకాశాలు మరింత పెరు గుతాయని అభిప్రాయపడ్డారు.

అధికారులు కదలాల్సిందే..

జిల్లాలో మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసే బాధ్యత అధికారులపై ఉందని, మంజూరైన పనులు గ్రౌండింగ్ జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు మంత్రి నాదెండ్లతో పాటు సమాచార మంత్రి కొలుసు పార్థ సారథి ఆదేశించారు. జిల్లాలో రోడ్డు గుంతల మరమ్మతు పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని, రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసే బాధ్యత అధికారులదే నన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ మండలంలో అందు బాటులోని ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీపం పథకంలో అర్హులైన ప్రతీ మహిళకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కాల్వలు, డ్రెయిన్ల పూడిక తీత పనులను కాల్వలు కట్టేసే సమయానికి ప్రారంభించి ఏప్రిల్, మే నెలాఖరునాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొలుసు అధికారులను ఆదేశించారు. శాసన సభ్యులుగా జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలకు, ఏలూరు కార్పొరేషన్ సమావేశాలకు తాము హాజరు కావాల్సి ఉందనే విషయాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమావేశం దృష్టికి తేగా ఈ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని మంత్రి పార్థ సారథి స్పష్టం చేశారు. సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రులు మనోహర్, పార్థసారథితోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు.

ఎవరెవరు ఏమన్నారంటే..



ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌లు రావాలి
పుట్టా మహేశ్, ఎంపీ
జిల్లాలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌లు రావాలి. 350 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

ఉప్పుటేరును వెడల్పు చేయాలి
డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే

కొల్లేరు ప్రాంతంలో వరద ముంపు ప్రమాద బారిన పడకుండా ఉప్పుటేరును వెడల్పు చేయాలి. కొల్లేరు డ్రెయిన్లలో తూడు, కిక్కిస, గుర్రపుడెక్కను తొలగించాలి.

జిరాయితీ భూములకు సరిహద్దులు

పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్యే
కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో ప్రభుత్వ, జిరాయితీ భూములకు సరిహద్దులు నిర్ణయించాలి. నారాయణపురం, గణపవరం బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి.

డాక్టర్లు అందుబాటులో ఉండాలి
సొంగా రోషన్‌కుమార్, ఎమ్మెల్యే

పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా క్వార్టర్స్ నిర్మించాలి. పీహెచ్‌సీలో అదనపు గదుల నిర్మాణానికి దాతలు ముందుకొచ్చినా అధికారులు అనుమతి ఇవకవలేదు.

నిర్వాసితులను ఆదుకోవాలి

చిర్రి బాలరాజు, ఎమ్మెల్యే
కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో నిర్వాసితులను సక్రమంగా నమోదు చేయలేదు. గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించాలి.

రైతులకు తగిన న్యాయం

ఘంటా పద్మశ్రీ, జడ్పీ చైర్మన్
కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో ధాన్యం రైతులకు రికార్డు సమయంలో 24 గంటల్లోపే సొమ్మును వారి ఖాతాల్లోనే జమ చేశారు.

జిరాయితీ భూములకు పరిహారం ఇవ్వాలి

జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్సీ
కొల్లేరు ఆపరేషన్ సమయంలో జిరాయితీ భూముల్లో 14 వేల ఎకరాల్లో చెరువులు ధ్వంసం చేశారు. వారికి పరిహారం అందించలేదు.

శనివారపుపేట కాజ్‌వే పనులు

బడేటి చంటి, ఎమ్మెల్యే
శనివారపుపేట కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించాలి. ఏలూరు ప్రభుత్వా సుపత్రిలో క్వాలిటీలో డాక్టర్లు రోగులకు అందు బాటులో ఉండడంలేదు.

అన్ని సమస్యలు తీర్చాలి

చింతమనేని ప్రభాకర్, ఎమ్మెల్యే
కృష్ణ కెనాల్‌లో వ్యర్థాలతో కలిసిన కలుషిత నీరు వస్తోంది. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆధీనంలో నిరుపయోగంగా ఉన్న 350 ఎకరాల భూమిలో కాలుష్య రహితంగా చేసే ప్రక్రియ చేపట్టాలి.

అదనపు పరిహారాలేవీ..?

- తోటగొంది గ్రామస్థులు విజ్ఞప్తి
- అభివృద్ధికి ఆమడదూరంలో పునరావాస గ్రామం
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు


తోటగొంది పునరావాస కాలనీ

ఏలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముందుగా పునరావాసాలకు తరలించిన ఎనిమిది గ్రామాల్లో తోటగొంది ఒకటి. అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో తోటగొంది గ్రామాన్ని ఖాళీ చేయించి పునరావాసానికి తరలించారు. అప్పట్లో రూ.లక్ష ప్యాకేజీ, రూ.30 వేల పరిహారం మాత్రమే ఇచ్చారు. ఆపై ఎటువంటి అదనపు ప్యాకేజీలు ఇప్పటి వరకు చెల్లించలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తమ సమస్యలను పట్టించుకోలేదని, పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను సైతం జగన్ విస్మరించారని వాపోతున్నారు. అధికారుల మాటలు విని పుట్టిన గడ్డను వదిలిపెట్టి తాము పునరావాసాలకు తరలి రావడం వలనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరిగాయని, తమకు పూర్తి స్థాయిలో పరిహారాలు ఇస్తే గానీ గ్రామం వీడిపోమని ఆనాడు తేల్చి చెప్పిఉంటే తమకు ఈ దుస్థితి కలిగి ఉండేది కాదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు.

తోటగొంది గ్రామం ఉన్న ప్రాంతంలో 6,917 ఎకరాల భూమిని సేకరించి ప్రస్తుత కుడి కాల్వ డెలివరీ రెగ్యులేటర్, జంటగుహలు, కుడి కాల్వ రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. మిగిలిన కొంత భూమిలో పైడిపాక చంద్రన్న కాలనీ నిర్మించి 63 కుటుంబాలను తరలించారు. తమ అందరిని అక్కడకు తరలించి ఉంటే బాగుండేదని నిర్వాసిత గ్రామస్థులు పేర్కొంటున్నారు. వాస్తవానికి తోటగొంది గతంలో ఇటుకలకోట పంచాయతీలో ఉండేది. పునరావాసం కింద ఆ గ్రామాన్ని వింజరం పంచాయతీ శివారుకు 2015 సంవత్సరంలో జూన్ 12న తరలించారు. ఆ ప్రాంతంలో ఇళ్ల సైతం పరిహారం సొమ్ములతో వారే సొంతంగా నిర్మించుకున్నారు. పునరావాస గ్రామం నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు వాటర్ ట్యాంకు శుభ్రతకు నోచుకోలేదు. ఆ నీరు వాడకం వల్ల చర్మ సమస్యలు, అనారోగ్యాల పాలవుతున్నామని, వీధులు, డ్రెయినేజీలు శుభ్రం చేసే దిక్కులేకుండా పోయిందని, వీధిలైట్లు వెలగడం లేదని, అటవీ ప్రాంతం కావడంతో విషకీటకాల బెడద ఎక్కువగా ఉంటోందని, వర్షాల సీజనులో కొండ వాగుల నీరు గ్రామాన్ని ముంచెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తమకు ఉపాధినందించే వ్యవసాయ పనులు, అటవీ ఉత్పత్తుల సేకరణ లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు పాదయాత్ర సమయంలో జగన్ చెప్పిన అదనపు పరిహారం కోసం వైసీపీ ఐదేళ్ల పాలనలో కాళ్ళరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 ఏళ్ల నిండిన వారికి ఇంటి స్థలం ఇచ్చారే గానీ పరిహారం ఇవ్వలేదని, ఇళ్ల నిర్మాణం చేయలేదని వాపోతున్నారు. ఇటీవల టీడీపీ కూటమి ప్రభుత్వం ముంపు గ్రామాల నిర్వాసితులకు పరిహారాల కింద రూ.900 కోట్లు వారి ఖాతాలకు జమ చేయడంతో తమలో మళ్ళీ ఆశలు నింపిందని, ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు అందాల్సిన అదనపు పరిహారాలను అందించాలని కోరుతున్నారు.


శిథిలమై పెచ్చులూడుతున్న వాటర్ ట్యాంకు

కరిగిన వేడి నీళ్ల బకెట్

మంటలు వ్యాపించి.. యువకుడి సజీవ దహనం

హీటర్ ఆన్ చేసి వదిలేయడమే కారణం.. ఏలూరులో ఘటన


గంగాధర్ (ఫైల్)

ఏలూరు క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): హీటర్ ఆన్ చేసి వదిలేయడంతో వేడి నీళ్ల బకెట్ కరిగి మంటలు వ్యాపించాయి. దీంతో ఓ యువకుడు సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన ఏలూరులో జరిగింది. ఏలూరు దక్షిణపు వీధిలోని పెద్దదేవుని గుడి సమీపంలో నివాసం ఉంటున్న జానా పద్మావతి సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తోంది. ఆమె తమ్ముడు గంగాధర్(30) ఇంజనీరింగ్ చదివి హైదరాబాద్‌లోని ఒక కన్సల్టెన్సీకి పనిచేస్తూ ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోంలో ఉన్నాడు. అతని తాత సూర్యనారాయణ రెండేళ్ల క్రితం ఏలూరులో అనారోగ్యంతో మరణించాడు. అతని మరణ ధ్రువ పత్రం తీసుకోవడానికి గంగాధర్ కాకినాడ జిల్లా అన్నవరం నుంచి గురువారం తెల్లవారుజామున ఏలూరులోని అక్క పద్మావతి వద్దకు వచ్చాడు. పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి మద్యం తాగి ఇంటికి వచ్చి మధ్యాహ్నం వరకు నిద్రించాడు. పద్మావతి బయటకు వెళ్లేటప్పుడు తలుపులకు బయట గడియపెట్టి వెళ్లింది. మధ్యలో నిద్ర లేచిన గంగాధర్ స్నానం చేయడానికి వేడి నీళ్ల కోసం ప్లాస్టిక్ బకెట్‌లో నీళ్లు పెట్టి హీటర్ ఆన్ చేసి మద్యం మత్తులో మళ్లీ నిద్ర పోయాడు. బాగా మరిగిన నీళ్లు బకెట్‌లో పడుతూ అది కరిగిపోవడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఆకస్మాత్తుగా లేచిన అతను బయటకు వెళ్లే దారిలేక ఇంట్లోనే సజీవ దహనమయ్యాడు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్లిన ఫైర్ సిబ్బంది చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

రహదారి భద్రతా నియమాలు పాటించాలి : కలెక్టర్

ఏలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారణ సాధ్యమని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాలు -2025 వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఈ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని, రహదారి ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కంకణబద్ధులు కావాలని కోరారు. మానవ తప్పిదాల వలనే 75 శాతం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. జిల్లా ఇన్‌చార్జి డీటీసీ కృష్ణారావు, ఆర్టీసీ డీఎం వాణి, ఎంవీఐలు బీమారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.




జనసేన కార్యకర్త కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్.. వార్త మెయిన్‌లో..

కూటమిలో విభేదాలున్నా.. కలిసికట్టుగా వెళ్లాలి : జనసేన శ్రేణులకు మంత్రి నాదెండ్ల పిలుపు

ఆగిరిపల్లి మండలంలో పెద్దపులి సంచారం?

ఆగిరిపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణవరం, పంచాయతీ పరిధిలోని కొండ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కృష్ణవరం గ్రామానికి చెందిన ముసలి కోటేశ్వరరావు మేకలు కాచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగానే ఉదయం కృష్ణవరంలోని కొండప్రాంతానికి మేకలను తోలుకి వెళ్లాడు. ఆ రోజు సాయంత్రం గాండ్రింపు శబ్దంతో మేకలు గుంపు భయపడి పరిగెత్తినట్లు తెలిపాడు. మేకల మంద నుంచి మూడు మేకలు కనిపించకపోవడంతో వెతకడానికి వెళ్ళిన మేకల కాపరి కోటేశ్వరరావుకు మేకలను పులి ఈడ్చుకు వెళ్ళిన ఆనవాళ్లు గుర్తించాడు. గుంపులో ఒక మేకకు గాయాలు గుర్తించి గ్రామస్థులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు వచ్చి కృష్ణవరం అటవీ ప్రాంతాన్ని పరిశీలించి కోటేశ్వరరావు దగ్గర నుంచి వివరాలు సేకరించారు. ఆశాఖ డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ కేఎస్‌వీ.హరిగోపాల్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎల్. బాల మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో పులి సంచరిస్తోందన్న ప్రచారంపై ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని, పులి సంచరించిన ఆనవాళ్లు లభించలేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కృష్ణవరం, సూరవరం, సగ్గురు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
తాడేపల్లిగూడెం ● శుక్రవారం 17 జనవరి 2025

సినిమాలో నా లుక్ తృప్తినిచ్చింది

- జగపతిబాబు



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్). నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. జగపతిబాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో తన లుక్ గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే సినిమా కోసం సన్నద్ధమవుతున్న వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "చాలా కాలం తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా 'ఆర్‌సీ 16' కోసం మంచి పాత్రను ఇచ్చాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా ఉంది" అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.






షాక్‌కు గురయ్యాం

సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడిపై టాలీవుడ్ హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసి షాక్‌కు గురయ్యామన్నారు. 'సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి నన్నెంతగానో కలచి వేసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'సైఫ్ సర్‌పై జరిగిన దాడి గురించి విని షాక్‌కు గురయ్యాను. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా' అంటూ జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. కాగా, ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రంలో విలన్ పాత్ర పోషించారు సైఫ్ అలీఖాన్. గతేడాది విడుదలైన ఈ మూవీకి సీక్వెల్‌గా 'దేవర-2' ప్రారంభం కావాల్సి ఉంది. సైఫ్ దాడికి గురికావడంతో ఇది మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

అందుకే సినిమాలు తగ్గించా

బ్రహ్మానందం



'సినిమాలు ఎందుకు తగ్గించేశానని చాలా మంది అడుగుతున్నారు. నాకు మంచి ఇమేజ్ ఉంది. దాన్ని కాపాడుకోవాలి. బ్రహ్మానందం బాగానే చేస్తున్నాడు కానీ.. ఒకప్పటిలా బాగా నవ్వించలేకపోతున్నాడు. ఆయన ఒకప్పుడు నటిస్తే వచ్చినంత నవ్వు ఇప్పుడు రావట్లేదు' అని కొందరు కమెడియన్లు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఎంత జాగ్రత్తగా చేసినా ఇలా దొరికిపోతుంటాం. ఇలాంటివి అనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే సినిమాలు సెలక్టివ్‌గా చేస్తున్నాను. దర్శకులు కూడా నేను ఇదివరకు చేసిన పాత్రలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. నన్ను ప్రేక్షకులు ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోవాలంటే రిపీట్ పాత్రలు చేయకూడదు. మరో కారణం, పెరుగుతున్న నా వయసు. ఒకప్పుడు చేసినంత ఉత్సాహంగా చేయలేకపోతున్నాను. అందుకే సినిమాలు తగ్గించేయాలని నిర్ణయం తీసుకున్నాను. నాకు సినిమాల్లో అవకాశాలు రాకా కాదు. దర్శకులు నాకు పాత్రలు ఇవ్వకా కాదు. నేను యాక్టింగ్ చేయలేకా కాదు" అని 'బ్రహ్మా ఆనందం' టీజర్ లాంచ్ కార్యక్రమంలో బ్రహ్మానందం చెప్పారు. తన తనయుడు రాజా గౌతమ్‌తో కలసి ఆయన నటించిన చిత్రమిది. ఆర్.వీ.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్‌యాదవ్ నక్కిన నిర్మించారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.



నిజ జీవిత ఘటనల ఆధారంగా...

అక్షయ్ హీరోగా దినేశ్ బాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'డియర్ కృష్ణ'. మమిత బైజు, ఐశ్వర్య కీలకపాత్రల్లో నటించారు. పి.ఎన్.బలరామ్ నిర్మాత. జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ప్రతీ షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది' అని అన్నారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం' అని అన్నారు. కాగా, మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ని ఎంపిక చేసి రూ.10,000 క్యాష్ బాక్ బహుమతిగా అందించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

సంక్రాంతి సినిమా ఫిబ్రవరిలో వస్తోంది



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్ నటించిన 62వ చిత్రం 'విడాముయర్చి' వచ్చే నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించిన మేకర్స్ గురువారం సాయంత్రం ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. తెలుగులో 'పట్టుదల' పేరుతో రిలీజ్ చేయనున్నారు. మగిళ్ తిరుమేని దర్శకుడు. త్రిష హీరోయిన్. సీనియర్ నటుడు అర్జున్ ప్రతినాయకుడి పాత్రను పోషించగా, రెజీనా కెసాండ్రా మరో ముఖ్య పాత్రలో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చిన ఈ మూవీని లైకా ప్రొడక్షన్ పతాకంపై ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇక ఈ ట్రైలర్‌లో 'అజిత్, త్రిష ప్రేమని చూపించి, ఆ తర్వాత వీళ్ళకు ఒక సమస్య ఉత్పన్నం కాగా దానిపై హీరో ఎలా పోరాడాడు అన్నది 2 నిమిషాల 22 సెకన్లతో ఈ ట్రైలర్‌ను కట్ చేశారు. హాలీవుడ్ మూవీ 'బ్రేక్‌డౌన్'కు ఇది రీమేక్‌గా చెబుతున్నారు. నిజానికి సంక్రాంతి పండుగకు రిలీజ్ కావాల్సి ఉండగా, హాలీవుడ్ రీమేక్ హక్కులు పొందడంలో తలెత్తిన సమస్యల కారణంగా వాయిదా వేశారన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



మా కుటుంబంలో గొడవలు దురదృష్టకరం



తమ కుటుంబంలో గొడవలు జరగడం దురదృష్టకరమని మంచు మనోజ్ అన్నారు. గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి తన భార్య భూమా మౌనికతో కలసి మనోజ్ వచ్చారు. బుధవారం ఎంబీయూ విద్యాసంస్థల వద్ద జరిగిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సినిమాలకు 8 సంవత్సరాలు దూరంగా ఉన్నానని, ఇప్పటికీ తనకు అభిమానులు ఉండటం దేవుడు ఇచ్చిన వరమన్నారు. తనపై అభిమానంతో ఉన్న వారిని బెదిరించడం దారుణమన్నారు. ఏదైనా ఉంటే తనను పిలిపించి మాట్లాడుకోవాలే గానీ, తన అభిమానులు కట్టిన ఫ్లెక్సీలను తొలగించడం పద్ధతి కాదన్నారు. తన అభిమాని పళణి, వినాయకన్‌ను పిలిచి, తనతో తిరగకూడదని బెదిరించారని, పిలిచి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొంటే గొడవలు సద్దుమణుగుతాయన్నారు. ఎంబీయూలో జరిగే క్యాంపస్ గురించి చర్చించుకొంటే సరిపోతుందన్నారు. మంచు విష్ణు అనుచరులైన హేమాద్రి, కిరణ్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)


దబిడి దిబిడి.. కళలో ఓ భాగమే

- ఊర్వశీ రౌతేలా



'బాలకృష్ణ గారు ఓ లెజెండ్. ఆయనతో కలసి పనిచేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇదంతా కళలో భాగం. బాలకృష్ణతో డ్యాన్స్ చేయడం కేవలం పెర్ఫామెన్స్ కాదు.. కళపై నాకున్న గౌరవానికి చేసుకున్న వేడుకగా భావిస్తా' అని అన్నారు నటి ఊర్వశీ రౌతేలా. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణ - ఊర్వశీ రౌతేలా 'దబిడి దిబిడి' పాట బాగా పాపులర్ అయ్యింది. అయితే ఇందులో ఓ స్టెప్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ఊర్వశీ రౌతేలా ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ 'బాలకృష్ణ గారితో పనిచేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఆయన ఆర్టిస్టులకు ఎంతో గౌరవం ఇస్తారు. ఒక సినిమా విజయం సాధించినప్పుడు దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. నేను ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను' అని అన్నారు. కాగా, ఈ పాట విడుదలైనప్పుడు వచ్చిన ట్రోల్స్‌పై కూడా ఊర్వశీ స్పందించారు. 'జీవితంలో ఏం సాధించలేని కొందరు కష్టపడేవారిని విమర్శించే అర్హత ఉందనుకుంటారు. రియల్ పవర్ అంటే ఇతరులను విమర్శించడం కాదు. వారి గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవడం' అని ఓ నెటిజన్‌కు ఘాటుగా బదులిచ్చారు.







బై.. బై..

సంక్రాంతికి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మూడు రోజులు పండుగ చేసుకున్న వారంతా బై.. బై.. బాబాయ్ అంటూ గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. పండుగ మూడు రోజులూ మమ్మల్ని, మాతో పాటు వచ్చిన స్నేహితులను కూడా ఎంతగానో ఆదరించారు. నువ్వే కాదు బాబాయ్ మన గోదావరి జిల్లావాసుల ఆదరాభిమానాలకు మా మిత్రుల సంతోషం మాటల్లో చెప్పలేం. మీ అందరి ఆత్మీయత, అనురాగాలతో తిరిగి వెళుతున్నాం. మీరు మా ప్రాంతానికి రావాలి. తప్పనిసరిగా వస్తారు కదూ.. మీ రాకకై ఎదురుచూస్తూ..

పాలకొల్లు టౌన్, ఆంధ్రజ్యోతి

భారం.. కష్టం..

సంక్రాంతి అతిథుల తిరుగు ప్రయాణం.. కిటకిటలాడిన బస్సులు



ఏలూరు నగరంలోని బస్ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

ఏలూరు/ ఏలూరు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పెద్ద పండుగ సందడి ముగియడంతో బంధు మిత్రులంతా బరువెక్కిన హృదయంతో భారంగా తిరిగి వెళుతున్నారు. బస్సులు, రైళ్ల రద్దీతో కష్టంగా ప్రయాణిస్తున్నారు. శుక్రవారం సెంటిమెంట్‌తో గురువారం ఉదయం, మధ్యాహ్నం నుంచే ప్రయాణాలు మొదలయ్యాయి. పండుగకు ముందే స్వస్థలాలకు వచ్చిన ఉద్యోగులు సెలవులు పూర్తి కావడంతో కొంతమంది పయనమయ్యారు. మరికొందరు రెండు రోజులు సెలవులు పొడిగించుకుని శని, ఆదివారాల్లో ప్రయాణానికి సమాయత్తం అవుతున్నారు. స్వగ్రామాలకు ముందస్తు రిజర్వేషన్లతో వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో బస్సు, రైళ్లు, ప్రైవేట్ సర్వీసుల రద్దీతో ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం కొంత రద్దీ తగ్గినా శని, ఆదివారాల్లో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.

కిటకిటలాడిన బస్ స్టేషన్లు

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు గురువారం సాయంత్రం నుంచి కిటకిటలాడాయి. ఎవరిని చూసినా నాలుగేసి బ్యాగ్‌లతో ఉన్నారు. వచ్చినప్పుడు రెండు బ్యాగ్‌లు ఉండగా వెళ్లేటప్పుడు మరో రెండు బ్యాగ్‌లు తోడయ్యాయి. బంధువులు ఇచ్చిన పిండివంటలు తమ పొలంలో పండిన పంటలు, పండ్లను తీసుకుని వెళ్లారు. ఏలూరు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ పవర్‌పేట, ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, నూజివీడు రైల్వే స్టేషన్, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, జీలుగుమిల్లి, చింతలపూడి, నూజివీడు, గుండుగొలను సెంటర్, భీమడోలు, కైకలూరు బస్టాండ్‌లు కిటకిటలాడాయి. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తమ ప్రయాణాన్ని కొనసాగించడంతో బస్సులు అన్నీ నిండిపోయాయి. రైళ్లు కూడా రద్దీగానే ఉన్నాయి. ప్రైవేటు బస్సుల నిర్వాహకులు గుట్టు చప్పుడు కాకుండా అధిక ధరలు వసూలు చేస్తూ ప్రయాణికులను ఎక్కించుకుని తీసుకువెళ్తున్నారు. ముందుగానే టిక్కెట్లు లేవంటూ చెప్పి బస్సు వస్తే ఖాళీ ఉంటే ఎక్కిస్తామంటూ ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. ఆ విధంగా అయినా డబ్బులు తీసుకుని గురువారం రాత్రి జిల్లాలో ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు యథేచ్ఛగా ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేశారు. దీంతో వారంతా దిక్కుతోచని పరిస్థితిలో ప్రయాణాన్ని కొనసాగించుకోవాల్సి వచ్చింది.

బోసిపోయిన గ్రామాలు

ఏలూరు రూరల్, చింతలపూడి, కామవరపుకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు వచ్చిన బంధుమిత్రులు కొత్త అల్లుళ్లతో వారం రోజులుగా పల్లెలు, పట్టణాలు కళకళలాడాయి. ఈసారి ప్రతి ఇంటికి బంధువులే కాదు ఎవరో ఒకరు అతిథులుగా రావడంతో ఆనందోత్సాహాల మధ్య గడిపారు. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు సందడిగా మారాయి. వచ్చిన వారంతా తెలిసిన ప్రతి ఒక్కరిని పలుకరించి యోగక్షేమాలు తెలుసుకుని ఆప్యాయతలను కురిపించారు. వారం రోజుల పాటు ఎంతో సందడిగా కనిపించిన వాతావరణం గురువారం ఒక్కసారిగా బోసిపోయింది. బంధువులు, మిత్రులు పెద్దసంఖ్యలో వాహనాలపై రావడంతో గ్రామాల్లో అధిక సంఖ్యలో కార్లు కనిపించాయి. పోలవరం బస్ షెల్టర్ వద్ద తిరుగు ప్రయాణమైన బంధువులు సాగనంపుతున్న గ్రామస్తులతో హృదయాలు భారంగా కాగా కిక్కిరిసిన ప్రయాణికులతో బస్సులు భారంగా కదిలాయి. కామవరపుకోట ప్రాంతానికి సంక్రాంతి సందర్భంగా ఇతర దేశాలు, రాష్ట్రాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు తిరిగి పయనమయ్యారు. లండన్, హైదరాబాద్, ముంబై, బెంగళూరు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారంతా బంధుమిత్రులతో ఆహ్లాదంగా గడిపి బరువెక్కిన హృదయాలతో తిరిగి వెళ్లారు.

టికెట్ ధర రెట్టింపు..!

ఆచంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వచ్చిన తిరుగు ప్రయాణంలో హృదయంతో పాటు జేబుకు కూడా భారమే. హైదరాబాద్ వెళ్లేందుకు రైలు, ప్రైవేటు ట్రావెల్స్ టికెట్లు అందుబాటులో లేవు. ఎంతైనా ఇస్తాం.. టిక్కెట్లు కావాలంటూ కొందరు ప్రైవేటు ట్రావెల్స్‌కు ఎగబడ్డారు. దీనితో ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధర ఒక్కసారిగా రెట్టింపైంది. హైదరాబాద్ టిక్కెట్ ధర రూ.వెయ్యి కాగా ఒకేసారి రూ.2 వేలకు పెంచినా దొరకని పరిస్థితి నెలకొంది. రెండు రోజులు పాటు టిక్కెట్‌ల డిమాండ్ ఇలాగే ఉంటుందని పలువురు చెబుతున్నారు.

హరిదాసు.. జంగమ దేవరల వీడ్కోలు



గణపవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏటా సంక్రాంతికి దర్శనమిచ్చే హరిదాసులు, బుడబుక్కలవారు, గంగిరెద్దులవారు జంగమదేవర్లు, పిట్టలదొరలు, బృందాలు పండుగ ముగియడంతో స్వగ్రామాలకు బయల్దేరుతున్నారు. గ్రామాల్లో సంక్రాంతి ముగిసేవరకు పర్యటిస్తూ సంక్రాంతి కళను తీసుకొస్తుంటారు. సంక్రాంతి పండుగ ముగియడంతో ఇంటింటికి వెళ్ళి బియ్యం, నగదు, బహుమతులు అందుకున్నారు. స్వగ్రామాలకు తీసుకెళ్లి అక్కడ చిరువ్యాపారాలు, కూలిపనులు కూడా చేసుకుంటామని తిరిగి సంక్రాంతి నెల ప్రారంభంలో ఇక్కడికి వస్తామన్నారు. తాతల నాటి సాంప్రదాయాలు కాపాడటమే తమ ధ్యేయమని ఎన్‌టీఆర్‌జిల్లా జగ్గయ్యపేటకు చెందిన దాసరి మల్లేష్ హరిదాసు తెలిపారు.

చింతలపూడి రావడం నరకమే



నా కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. బెంగళూరు నుంచి ఏలూరు ఏలూరు వచ్చిన తరువాత చింతలపూడి చేరుకోవడం కష్టమే. లగేజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో మాదిరిగా చింతలపూడి నుంచి సర్వీసులు నడవడంలేదు. నడిచే సర్వీసులు ఎక్కడ నిలిచిపోతాయో తెలియదు. అధికారులు దృష్టి సారించి పరిష్కారం చేయాలి.

పొట్టి వెంకటేశ్వరరావు, చింతలపూడి

దూర ప్రయాణం కష్టం



మాది చింతలపూడి మండలం నామవరం. దూర ప్రాంతాలకు వెళ్లి రావాలంటే ఏలూరు లేదా సత్తుపల్లి వెళ్లాల్సిందే. తర్వాత చింతలపూడి అక్కడి నుంచి మా గ్రామానికి చేరుకోవాలి. ఇది నా ఒక్కడి సమస్య కాదు. గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక మంది హైదరాబాద్‌లో చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తున్నారు. పనిమీద రావాలన్నా, వెళ్లాలన్నా ప్రయాణం నరకమే. చింతలపూడి వచ్చి మండలం లోపల ఉన్న గ్రామాలకు వెళ్ళాలంటే ఇంకా నరకమే. ఏ సర్వీసులు ఉండవు, ఆటోలు ఉండవు. ఇంకా అడవిలో ఉన్నామా అన్నట్టు ఉంటుంది. చింతలపూడి ప్రయాణమంటేనే భారంగా ఉంది. ఇప్పటికైనా మార్పులు తీసుకురావాలని కోరుతున్నారు.

ఇ.అశోక్‌కుమార్, నామవరం



మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్

డాక్టర్ రాజ్యలక్ష్మి

మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ (క్లాసిక్ విభాగం) కిరీటం నూజివీడుకు చెందిన దంత వైద్యురాలు వై.రాజ్యలక్ష్మి సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 12న ఆమె టైటిల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మితో ఆంధ్రజ్యోతి ముఖాముఖి.

● టైటిల్ గెలుచుకోవడం..?

మహిళలు ముందడుగు వేస్తూ ప్రతి రంగంలో విజయం సాధించినప్పుడే సమాజం ముందుకు వెళుతుంది. మహిళా సాధికారికత దిశగా పయనించాలి.

● సమాజ శ్రేయస్సుకు చేసే కృషి..

సమాజాభివృద్ధికి సనాతన ధర్మం దోహదపడుతుంది. సనాతన ధర్మాన్ని కాపాడినప్పుడే ఉమెన్ ఎంపవర్‌మెంట్ సాధ్యం. దీన్ని మెయిన్ థీమ్‌గా తీసుకుని మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ క్లాసిక్ విభాగంలో విజేతగా ఎంపిక కాగలిగాను.

● వైద్యురాలిగా.. అందాల పోటీలు.. ఎలా సమన్వయం చేయగలిగారు?

మహిళ కుమార్తెగా, చెల్లిగా, అక్కగా, భార్య, మాతృమూర్తిగా తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తుంది. ఆరోగ్యకర సమాజాన్ని ఏర్పరచడంలో మహిళ పాత్ర కీలకం. సీతాదేవిని ప్రేరణగా తీసుకుని అన్నిరంగాల్లో ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు సాగాలనే ఆలోచనే అటు వైద్యురాలిగా, ఇటు మోడల్‌గా విజయం సాధించేందుకు అవకాశం కలిగించింది.

● మున్ముందు మహిళాభివృద్ధి..?

మనది పూర్వం మాతృస్వామ్య సమాజం. ఇప్పుడు కూడా విద్య, వ్యాపారం, ఇతర రంగాల్లో దాదాపు సగభాగం మహిళల పాత్ర ఉంది. మిగిలిన రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది.

(నూజివీడు, ఆంధ్రజ్యోతి)

గోవిందా.. గోవిందా..

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

హోరెత్తిన గోవింద నామ స్మరణ



ద్వారకాతిరుమల ఆలయ తూర్పు రాజగోపురం వద్ద భక్తుల సందడి

ద్వారకాతిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలు ముగియడంతో గురువారం వేలాదిగా భక్తులు చినవెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. గోవింద నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ద్వారకాతిరుమల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 15వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాల సమాచారం. స్వామివారి దివ్య మూర్తులను దర్శించి భక్తులు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతర స్వామివారి ఉచిత ప్రసాదాలను, అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంటల వరకూ సమయం పట్టింది.

కనుల పండువగా అధ్యయనోత్సవాలు

శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ముక్కోటి పర్వదినం మొదలుగా పది రోజులు ఉత్సవాలను జరపడం సంప్రదాయం. గురువారం సాయంత్రం ఉభయదేవేరులతో స్వామివారిని తొళక్క వాహనంపై ఉంచి నిత్య కల్యాణ మండప ఆవరణలోకి తెచ్చారు. మండపంలో వేదికపై బంగారు సింహాసనంపై ఉత్సవ మూర్తులను ఉంచి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం నవ కలశస్నపన, అభిషేకాలను నిర్వహించారు. ఆ తరువాత తిరుమంజనాలు జరిపి స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు సేవా కాలాన్ని జరిపి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. అనంతరం శ్రీవారి తిరువీధి సేవ క్షేత్రంలో వైభవంగా జరిగింది.



బంగారు సింహాసనంపై స్వామి, అమ్మవార్లు

ఉత్కంఠభరితంగా కబడ్డీ పోటీలు

పురుషుల విభాగంలో దూసుకుపోతున్న సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ, జమ్ముకాశ్మీర్, ఆంధ్ర జట్లు

మహిళా విభాగంలో ఆంధ్రా, ఢిల్లీ, పాటియాల జట్లు



కోల్‌కత్తా - ఢిల్లీ జట్ల మధ్య పోటీ

నరసాపురం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుస్తుంబాదా కబడ్డీ స్టేడియంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు గురువారం మూడో రోజు ఉత్కఠభరింతంగా జరిగాయి. లీగ్ కం నాటౌక్ పద్ధతిలో జరుగుతున్న ఈపోటీలకు పురుషుల విభాగంలో 19, మహిళల్లో 18 రాష్ట్రాల జట్లు తలపడుతున్నాయి. శుక్రవారం సెమీ ఫైనల్స్‌కు చేరనున్నాయి.

ఇప్పటి వరకు జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో ఢిల్లీ సీఆర్‌పీఎఫ్, జమ్ము కాశ్మీర్, ఆంధ్రా, కొల్‌కత్తా పోలీస్ జట్లు ముందంజలో ఉన్నాయి. మహిళా విభాగంలో ఆంధ్రా, సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ, పాటియాల జట్లు దూసుకుపోతున్నాయి. అన్ని జట్లలో జాతీయ స్థాయి క్రీడాకారులు ఉండడంతో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సెమీఫైనల్స్ ఫైనల్స్‌కు ఏ జట్లు చేరతాయనేది ఉత్కఠభరితంగా మారింది. పోటీలు తిలకించేందుకు ఉభయగోదావరి జిల్లాల నుంచి క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కబడ్డీ స్టేడియం కిక్కిరిసిపోయింది. ఆంధ్రా జట్లు తలపడుతున్నప్పుడల్లా అభిమానులు కేకలతో ఉత్సాహపరిచారు. గురువారం పురుషుల విభాగంలో జరిగిన పోటీలో సీఆర్‌పీఎఫ్ భువనేశ్వర్‌ను 37 పాయింట్లు, కోల్‌కత్తా పోలీస్ జట్టును కేరళ పోలీస్‌ల మధ్య జరిగిన పోటీలో కోల్‌కత్తా 29 పాయింట్లు, యూపీ - కేరళ మధ్య జరిగిన పోటీలో యూపీ 21 పాయింట్లతో విజయం సాధించాయి. మహిళా విభాగంలో భువనేశ్వర్ జట్టును కేరళ 33, పాటియాల జట్టును రాజస్తాన్ 20, ఫరీదాబాద్ జట్లు భువనేశ్వర్‌పై 23 పాయింట్లతో, ఆంధ్రా ఫరిదాబాద్ జరిగిన హోరాహోరి పోటీలో ఆంధ్రా 9 పాయింట్లతో విజయం సాధించింది. ఈ పోటీలను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కన్వీనర్ జానకిరామ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సీఈవో వీరలంకయ్య, దొండపాటి స్వామి, ప్రసాద్ తిలకించారు.



మధ్యప్రదేశ్ గవర్నర్ నుంచి అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయులు

కైకరం విద్యార్థినికి

జాతీయ పురస్కారం

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఉంగుటూరు విద్యార్థిని అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 3 నుంచి 6 వరకు భోపాల్‌లో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఢిల్లీ పబ్లిక్ స్కూలు, ఏలూరు జిల్లా కైకరం హైస్కూలు నుంచి తాడి చెట్ల పెంపకం- భవిష్యత్ నూతన వ్యవసాయ విధానం ప్రాజెక్టును ప్రదర్శించిన నెర్సు కుసుమ లత, పొడుగు రామ్ చరణ్ అవార్డుకు ఎంపికయ్యారు. వారి ప్రాజెక్ట్ ఎంపిక కావడంతో రాష్ట్రం తరఫున గైడ్‌లు రామకృష్ణ, సారధి మధ్య ప్రదేశ్ గవర్నర్ మంగూభాయి సి.పటేల్ నుంచి అవార్డు అందుకున్నారని పాఠశాల హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు గురువారం తెలిపారు. కైకరం హైస్కూలు నుంచి ఫిజిక్స్ టీచర్ జాన్ గైడ్‌గా వ్యవహరించారు.

పేదింటి బిడ్డ కుసుమలత



ఏలూరు మండలం పోణంగి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నెరుసు శ్రీనివాస రావు, లక్ష్మి దంపతుల కుమార్తె కుసుమ లత. అమ్మమ్మ ఊరైన ఎ.గోకవరంలో ఉంటూ కైకరం హైస్కూలులో చదువుతోంది. ప్రస్తుతం కుసుమలత పాలిటెక్నిక్ ప్రధమ సంవత్సరం చదువుతోంది. హైస్కూలు హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, విద్యా కమిటీ ఛైర్మన్ అల్లూరి జగన్మోహిని, సభ్యులు అభినందించారు.



ప్రవచనం చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ, పాల్గొన్న భక్తులు

సంప్రదాయాలను

పాటించండి

గణపతి సచ్చిదానంద స్వామీజీ

భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ సంప్రదాయాలను పాటించాలని, సంప్రదాయంగా కనిపించాలని, భగవద్గీతను చదవాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. భీమవరం అష్టలక్ష్మీ దేవాలయంలో గురువారం గణపతి సచ్చిదానంద స్వామీజీ, శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ శ్రీకార్యసిద్ధి హనుమత్ ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ మనుషులు, దేవతలకు అహంకారం తీసేది ఈశ్వరుడని, భవిష్యత్ బ్రహ్మ అని అన్నారు. అందరూ భక్తి భావాన్ని పెంచుకోవాలని సూచించారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని, సమస్త భక్తులను కాపాడే అవతారమే శివుడు, దత్తాత్రేయ అవతారమే నేడు కనిపిస్తున్న హనుమంతుడని అన్నారు. మన శరీరంతో మనం వెళ్లలేమని, ఎప్పుడో ఒకప్పుడు శరీరాన్ని వదిలేయవలసిందేనని స్వామీజీ అన్నారు. భగవన్నామస్మరణ ఒక్కటే భక్తి, ముక్తి మోక్షానికి మార్గమని వివరించారు.



మావుళ్లమ్మ ఉత్సవాల్లో అలరించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు

వైభవంగా మావుళ్లమ్మ ఉత్సవాలు



భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనార్థం గురువారం భక్తులు క్యూ కట్టారు. ఉదయం నుంచి భక్తుల తాకిడి కనిపించింది. సాయంత్రం 6 గంటల తరువాత ఇతర ప్రాంతాల భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. రాత్రి వేళ ఆలయ కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు చేసిన ప్రత్యేక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాంతారా, కాంచన వంటి నృత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి సంకీర్తనలు, సాయంత్రం 4 గంటలకు పిప్పళ్ళ ప్రసాద్ ఆధ్యాత్మిక సంకీర్తన, రాత్రి 9 గంటలకు విజయదుర్గా నాట్యమండలి మాయాబజార్ నాటకం ప్రదర్శించారు.



సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు



కబడ్డీ పోటీలో హోరాహోరీ తలపడుతున్న తణుకు- జంగారెడ్డిగూడెం మహిళల జట్లు

రేపు యోగి వేమన జయంత్యుత్సవం



ఆరవల్లిలో పోటీలు ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

ఆరవల్లిలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

అత్తిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లిలో గురువారం నుంచి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 18న వేమన జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి స్త్రీల కబడ్డీ టోర్నమెంట్‌ను గ్రామ ప్రముఖులు గొలుగూరి వెంకటరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ వెలగల సుస్మితరెడ్డి, ఎంపీటీసీ దొమ్మేటి రమ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా నుంచి ఆరు జట్లు పోటీలలో పాల్గొన్నాయి. తణుకు- జంగారెడ్డిగూడెం మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో జంగారెడ్డిగూడెం జట్టు విజయం సాధించింది. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను రిటైర్డు డ్రిల్ మాస్టర్ వెలగల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. జిల్లా కబడ్డీ సెక్రటరీ వై.శ్రీకాంత్, కమిటీ ఛైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి పార్ధసారథి

» గాయపడిన మహిళను కాన్వాయిలో ఆసుపత్రికి పంపిన వైనం

ఏలూరు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన మహిళను సమీపంలోని ఆసుపత్రికి పంపించి మానవత్వాన్ని చూపించారు. గురువారం ఏలూరులో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం ముగించుకుని విజయవాడకు తిరిగి వెళ్తుండగా జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడూరుపాడుకు చెందిన కె.శిరీష తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో హైవేపై వెళుతున్న మంత్రి ప్రమాదాన్ని చూసి కాన్వాయ్‌ని ఆపి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. వెంటనే మరో వాహనంలో సమీపంలోని పిన్నమనేని ఆసుపత్రికి తీసుకుని వెళ్ళి వైద్యం చేయించమని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మహిళకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో శిరీష తల్లి కూడా స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంపై మంత్రి స్పందించిన తీరుకు హైవేపై ప్రయాణిస్తున్న పలువురు మెచ్చుకున్నారు.


ప్రమాద ఘటన వద్ద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి


మాజీ ఎంపీటీసీ నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్

టీడీపీ సీనియర్ నేత నాగేశ్వరరావు కుటుంబానికి ఎంపీ పరామర్శ

చింతలపూడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :ఇటీవల కన్నుమూసిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ యర్రంపల్లికి చెందిన పాకనాటి నాగేశ్వరరావు కుటుంబాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పరామర్శించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామంలో సుపరిచితమైన నాగేశ్వరరావు లేకపోవడం పార్టీకి తీరనిలోటన్నారు. టీడీపీ మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

జీకే పోటీల్లో స్టేట్ టాపర్ ఆసిఫాకు సన్మానం

ఏలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన షేక్ ఆసిఫా ఇటీవల ముందూరులోని మదర్సాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ జీకే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్టేట్ టాపర్‌గా నిలిచిందని లక్కవరం ఫారూఖి మసీదు కమిటీ అధ్యక్షుడు పఠాన్ అన్వర్‌బాషా గురువారం తెలిపారు. గురువారం లక్కవరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో వారి ఇంటి వద్ద ఘనంగా సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం కుటుంబాలలో పిల్లలంతా చదువుతో పాటు ఉర్దూ, అరబిక్ నేర్చుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు. మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ పకీర్ షా మనుమరాలైన ఆసిఫా ముందూరులోని ఏడో మైలు రాయి వద్ద ఉన్న మదర్సాలో తొమ్మిదో తరగతి చదువుతుందన్నారు. మసీదు ఇమామ్ ఎండి.బాబర్ ఆలీ, మసీదు కమిటీ సభ్యులు నాసిర్, అజ్గర్‌వలీ, రహంతుల్లా, బాషా, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫా ను సత్కరిస్తున్న లక్కవరం ఫారూఖి మసీదు కమిటీ సభ్యులు

కడమ్మకు చీరలు, సారె సమర్పణ

ఏలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరంలో గ్రామదేవత కడమ్మ ఉత్సవ విగ్రహాన్ని గురువారం పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తరపున మాజీ ఉప సర్పంచ్ మంగిన కొండ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగిన పోశీరత్నం, మేడూరి పార్వతి, పట్నాల దేవి తదితరులు అమ్మవారికి చీర సారెలు, పసుపు, కుంకుమలతో ఘన స్వాగతం పలికి పల్లకి మోశారు. బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ ఊరేగింపు, గోదావరి రజక సంఘానికి మేకపోతుని అందజేశారు. గ్రామస్థులు అమ్మవారికి చీర సారెలు పసుపు కుంకుమ, నైవేద్యాలు సమర్పించి భక్తితో మొక్కారు.


అమ్మవారి ఊరేగింపులో భక్తులు

కోడి పందేలు, జూదంపై పోలీస్ దాడులు

భీమడోలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట ఆడిన 29 మందిపై కేసులు నమోదు చేశామని భీమడోలు పోలీసులు తెలిపారు. ఈ నెల 12 నుంచి 15 వరకు మొత్తం 29 మందిపై పేకాట, కోడిపందేలు, గుండాట ఆడుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కొమ్మరలో ఐదుగురి అరెస్ట్

ద్వారకాతిరుమల : మండలంలోని కొమ్మరలో జరుగుతున్న కోడిపందేలపై ద్వారకాతిరుమల పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పందెగాళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.10,270 లను స్వాధీనం చేసుకున్నారు. రెండు కోడిపుంజులను, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చేబ్రోలు పరిధిలో 19 మంది అరెస్ట్

ఉంగుటూరు : ఉంగుటూరు మండల పరిధిలోని చేబ్రోలు పోలీసులు సంక్రాంతి సందర్భంగా 19 జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 17 వాహనాలు, రూ.1,66,020 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు. కంసాలిగుంట గ్రామంలో కోడి పందేలపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను, రెండు కోళ్ళను రూ.7 వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

» వైద్యుడిపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం

ఏలూరు క్రైం/ఏలూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'ఆసుపత్రి ఎముకల విభాగంలో ఉదయం 9 గంటలకు వచ్చిన రోగులకు 10 గంటలు దాటినా ఎందుకు వైద్యసేవలు అందించలేదు.. వైద్యులు, వైద్యసిబ్బంది సమయపాలన పాటించి వైద్య సేవలు అందించాలి' అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీకి సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించి బోర్డులో వున్న వివరాలు తప్పుగా ఉండడం గమనించి సంబంధిత సెంటర్ ఇన్‌చార్జిని నిలదీశారు. డ్రైయినేజీ, సీసీ రోడ్లు, పంపు లీకేజీలపై ఫిబ్రవరి 28వ తేదీలోగా డ్రెయిన్‌లు, సీసీ రోడ్లు పూర్తి చేయాలని వైద్య విధాన పరిషత్ ఈఈని మంత్రి ఆదేశించారు. కంటి విభాగాన్ని, ఐసీయూను తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో టీం స్పిరిట్‌తో పనిచేసి పేదలకు వైద్య సేవలందించాలని అన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలను తీసుకోవడానికి కృషి చేస్తామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి, ఆసుపత్రి డాక్టర్లు, నర్సులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

లక్ష్యాన్ని మించి ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో రూ.733.91 కోట్ల విలువైన 3,58,924 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 49 వేల 22 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రైతులకు సొమ్ములు చెల్లించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. వాస్తవానికి 3.40 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం నిర్దేశించగా దానికి మించి కొనుగోలు చేశారని కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డిలను మంత్రి అభినందించారు. మరో 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు చెబుతున్నారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.

6 నుంచి శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఏలూరుకార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని, ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు నిర్వహించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని ఏఐవైఎఫ్ జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు అన్నారు. గురువారం స్ఫూర్తి భవనంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని 2014లో హామీ ఇచ్చి గడచిన 11 ఏళ్లలో 22 కోట్ల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం కనీసం రెండు లక్షల మందికి కూడా ఉపాధి కల్పించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పడిన టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి లేకపోతే నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఎటువంటి కార్యాచరణకు ప్రభుత్వం ప్రయత్నించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, విద్యా, వైద్యం, ఉపాధి ప్రభుత్వాలే కల్పించాలని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేటీకరణను విడనాడాలని కోరారు. శ్రీకాకుళంలో నిర్వహించే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు క్రాంతికుమార్, జయరాజు, ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

ఏలూరుటూటౌన్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్‌ల మరమ్మతులపై ఉచిత శిక్షణ అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. జిల్లాకు చెందిన వారై 18-45 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. విద్యార్హత 5వ తరగతి, ఆపై చదివి ఉండాలన్నారు. నెలరోజుల పాటు ఉచిత శిక్షణ, గ్రామీణ ప్రాంతాల వారు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి ఉచిత భోజన సదుపాయం అందిస్తామన్నారు. వివరాలకు 99485 65256 నంబరులో సంప్రదించాలన్నారు.

వృద్ధ కళాకారులకు పెన్షన్ పెంపుదల చేయాలి

కామవరపుకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వృద్ధ కళాకారులకు ఇచ్చే పెన్షన్ వారి మందులకే సరిపోవడంలేదని కొంతనగదు పెంపుదల చేయాలని ఏపీ ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టి.వి.ఎస్.రాజు గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సీనియర్ కళాకారులను ఆదుకోవాలని అభ్యర్థించారు. దాతలు వృద్ధ కళాకారులకు చేయూతనివ్వాలన్నారు.

కార్మికులకు పని గంటల పెంపు తగదు

ఏలూరుకార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు పని గంటలు పెంపు చేయాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారానికి 90 పని గంటలు ఉండాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమన్నారు. కార్పొరేట్ మత శక్తుల కూటమిగా కేంద్రంలో సాగుతున్న ప్రభుత్వం కుట్రపూరితంగా పని గంటలు పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ఎనిమిది గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న కార్మిక వర్గం మరో పోరాటానికి సిద్ధంకావాలని పేర్కొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కుల అందజేత

ఉంగుటూరు, జనవరి 16 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జనసేన కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల చెక్కును జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఏలూరులో గురువారం అందించారు. నారాయణపురం గ్రామానికి చెందిన దానేటి వాసు, నిడమర్రు మండలం మందలపర్రు గ్రామ వాసి గంగుల శ్రీను కుటుంబానికి బీమా మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తదితరులు ఉన్నారు.


చెక్కులు అందించిన నాదెండ్ల, పత్సమట్ల

116 రకాల వంటకాలతో విందు

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరులో చిరుద్యోగి ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న షేక్ నాని జమాల్ తన చెల్లి, బావ సంక్రాంతి పండుగకు ఇంటికి రావడంతో బుధవారం రాత్రి 116 రకాల వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. ఈ విషయమై గురువారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఇంటికి వచ్చిన చెల్లి, బావ కోసం 116 రకాల పదార్థాలతో విందు ఏర్పాటు చేశామన్నారు. నూతన దంపతులతో పాటు బంధువులందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు.



మృతదేహ ఖననం అడ్డుకున్న వారిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి చెందిన శ్మశాన వాటిక భూమి తనదేనంటూ ఒక చర్చి పాస్టరు, ఆ చర్చి పెద్దలు కలిసి ఒక మృతదేహాన్ని ఆ శ్మశాన వాటికలో ఖననం చేయకుండా అడ్డుకోవడంతో వారిపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వట్లూరుకు చెందిన కర్నే కె.రంగారావు (63) అనారోగ్యంతో మరణించాడు. అతడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వట్లూరులో ఉన్న క్రైస్తవ శ్మశానవాటికకు తీసుకు వెళ్తుండగా వట్లూరుకు చెందిన ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆసిస్, ఆ చర్చి పెద్దలు 12 మంది, ఇతరులు కలిసి శ్మశానవాటికకు మృతదేహాన్ని రానీయకుండా అడ్డుకున్నారు. మృతుడి బంధువులు వీఆర్వోకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో -1 కె.దుర్గారావు వచ్చి పరిశీలించారు. ఆ స్థలం ప్రభుత్వ పోరంబోకు అని.. ఎవరైనా ఆ శ్మశానవాటికలో ఖననం చేసుకోవచ్చని చెప్పినా ఆ ఫాదర్‌తో పాటు వారందరూ కలిసి వీఆర్వో విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు పెదపాడు తహసీల్దార్, త్రీటౌన్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి ఆ మృతదేహాన్ని ఖననం చేయించారు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులకు వీఆర్వో ఫిర్యాదు చేయడంతో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆసిస్‌తో పాటు ఇతరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

భీమడోలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలను సీతారామస్వామి ఆలయంలో ఈనెల గురువారం నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయని ఉత్సవ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈనెల 20 వరకు జరుగుతాయన్నారు. 18న సీతారామ స్వామి త్యాగరాజస్వామికి అభిషేకాలు, శాంతి కల్యాణాలు జరుగుతాయన్నారు.

ఇంటర్వ్యూ..

సానిగూడెం పరిధిలో సాగునీరు పుష్కలం


యలమర్తి శ్రీనుబాబు
పెద్ద చెరువు సాగు నీటి వినియోగ దారుల సంఘం అధ్యక్షుడు, సానిగూడెం

- **సానిగూడెం పెద్ద చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం కింద ఎన్ని ఎకరాలు పంట భూమి ఉంది ?**

జవాబు : 364 ఎకరాల పంట భూమి ఉంది. 125 మంది రైతులు ఉన్నారు

- **డిమాండ్‌కు తగ్గ సాగునీరు ఉందా ?**

జవాబు : సానిగూడెం పరిధిలో సాగునీరు ఉంది, ప్రతి రైతుకు నీరు అందుతుంది.

- **చెరువును అభివృద్ధి చేయలా ?**

జవాబు : చెరువు కొంత మేర అభివృద్ధి చేయాల్సి ఉంది. తూరలకు మరమ్మతులు, కాల్వల పనులు చేయించాల్సి ఉంది

- **ఆయకట్టులో శివారు రైతుల పరిస్థితి ఏంటి ?**

జవాబు : ఎమ్మెల్యే చింతమనేని ఆదేశాలతో ప్రతి రైతుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం

- **చెరువు అభివృద్ధికి ఎంత నిధులు అవసరం ?**

రూ.కోటి నిధులకు అవసరం ఉంది. స్థానిక ఎమ్మెల్యేను కలిసి నిధులు కోరతాం.

(ఆంధ్రజ్యోతి-దెందులూరు)

18,19న పీసా గ్రామ కమిటీ ఎన్నికలు

ఏలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో ఇటీవల వాయిదా పడిన పీసా కమిటీ ఎన్నికలు ఈనెల 18, 19వ తేదీలలో నిర్వహిస్తామని ఎంపీడీవంఎంపీడీవో ఈ.శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న కోయకుంకాల, శివగిరి, ఎల్లండీపేట, కొండ్రుకోట, కొత్తమామిడి గొంది, ప్రగడపల్లి, రేపల్లెవాడ గ్రామాల్లో, 19న పైడిపాక, పైడాకులమామిడి, బోడిగూడెం, వింజరం, సున్నాలగండి గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

కుక్కునూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వెలుగు యానిమేటర్లకు ఆరు నెలల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై. సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించటానికి గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న యానిమేటర్లకు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వారి సమస్యలు పట్టించుకోకుండా ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, వలీబాష, కాకర్ల శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. పెదవేగితో పాటు గార్లమడుగు, సూర్యారావుపేట, వెంకటకృష్ణా పురం, లక్ష్మీపురం, ఎంఆర్‌సీ కాలనీ, న్యాయంపల్లి గ్రామాల్లో కరెంట్ ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

సాయి మందిరాల్లో అన్నప్రసాద వితరణ

ఏలూరు కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ముక్కనుమ పండుగ పురస్కరించుకుని గురువారం నగరంలోని పలు డివిజన్లలో గల షిరిడీ సాయి మందిరాల వద్ద మందిర్ నిర్వాహకులు భక్తులకు మహా అన్నప్రసాద వితరణను నిర్వహించారు. బాబా వారికి ఈ సందర్భంగా భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సాయి నామ స్తోత్రాలను పఠించారు. సంకీర్తనలను ఆలపించారు. భజనలు నిర్వహించారు. పల్లకీ సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆదివారపుపేటలోని షిరిడీ సాయి ప్రేమ మందిరం వద్ద ఆలయ శాశ్వత ధర్మకర్త ఇనుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. పన్నెండు పంపుల సెంటర్, పత్తేబాద, అశోక్‌నగర్, దక్షిణపువీధి తదితర ప్రాంతాల్లో షిరిడీ సాయి మందిరాల వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణను నిర్వహించారు.

చెల్లనిచెక్కు కేసులో ఒకరికి ఏడాది జైలు

నూజివీడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బాకీ నిమిత్తం చెల్లనిచెక్కు ఇచ్చిన ఒకరికి సంవత్సరం జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ నూజివీడు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు తీర్పు ఇచ్చారు. కర్రే విజయలక్ష్మి దగ్గర 2020లో దయాల కుమారి రూ.10 లక్షలు అప్పుగా తీసుకుంది. బాకీ చెల్లించాలని విజయలక్ష్మిని కోరగా ఇచ్చిన చెక్కు బ్యాంకులో నగదు లేదని తిప్పి పంపారు. విజయలక్ష్మి నూజివీడు కోర్టును ఆశ్రయించగా దాయల కుమారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సీసీ రోడ్లతో మారుతున్న గ్రామాల రూపురేఖలు

» వేగవంతంగా లింగపాలెం మండలంలో రహదారుల నిర్మాణ పనులు » రూ.5.32 కోట్ల నిధులతో సీసీ, అంతర్గత రోడ్లు

లింగపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఎమ్మెల్యే నియోజక అభివృద్ధి (ఏసీడీఎఫ్) నిధుల ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు గుంతలు పడి అధ్వానంగా మారాయి. వర్షాకాలంలో వస్తే రోడ్లన్నీ బురదకయ్యలుగా మారి ఆయా మార్గాలలో ప్రయాణించాలంటేనే నరకంగా ఉంటుందని ఆపసోపాలు పడుతూ ప్రయాణాలు సాగించేవారు. కూటమి ప్రభుత్వం రావడంతో మండలంలోని అన్ని అంతర్గత రహదారులు, ప్రధాన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మండలంలో ఐదు కోట్ల ముప్పై రెండు లక్షల పదివేల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపడుతున్నారు. రోడ్ల నిర్మాణ పనుల విషయంలో, నాణ్యతలో రాజీపడకుండా నిర్ణీత వ్యవధిలోపు పనులు పూర్తయ్యేలా స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చొరవ చూపడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. మండలంలో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తవ్వగా మిగిలిన 30 శాతం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.





అయ్యప్పరాజుగూడెంలో గతంలో గుంతలు పడిన అంతర్గత రహదారి.. కూటమి పాలనలో ప్రయాణానికి అనుకూలంగా నిర్మించిన రహదారి

ఎమ్మెల్యే చొరవతో గ్రామ రోడ్లకు మోక్షం



గత వైసీపీ పాలనలో గ్రామాల్లోని అంతర్గత రహదారులన్నీ అధ్వానంగా ఉండేవి. గత ప్రభుత్వం నాలుగేళ్లుగా అంతర్గత రహదారులను పటించుకోలేదు. మండల కేంద్రమైనా లింగపాలెంలోనూ డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి ఆ మార్గంలో నడవాలంటేనే ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే రోషన్‌కుమార్ చొరవతో గ్రామంలో రోడ్లకు మోక్షం కలిగింది.

- అసిలేటి అజయ్, కళ్యాణంపాడు.

కూటమి ప్రభుత్వంతో రోడ్లకు కొత్త కళ



నాలుగేళ్లుగా రోడ్లను పట్టించు కోలేదు. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రధాన, అంతర్గత రహదారులన్నీ గుంతలు పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపై గుంతలలో నీరుచేరి చెరువులను తలపించేవి. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు, పాదచారులు బాధలు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామాల్లో రోడ్లన్నీ కొత్త కళను సంతరించుకున్నాయి.

- శిలారపు రవి, అయ్యప్పరాజుగూడెం



ఏలూరు నగరంలోని బస్ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

భారం.. కష్టం..

సంక్రాంతి అతిథుల తిరుగు ప్రయాణం.. కిటకిటలాడిన బస్సులు

మండవల్లి/ఏలూరు/ ఏలూరు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పెద్ద పండుగ సందడి ముగియడంతో బంధు మిత్రులంతా బరువెక్కిన హృదయంతో భారంగా తిరిగి వెళుతున్నారు. బస్సులు, రైళ్ల రద్దీతో కష్టంగా ప్రయాణిస్తున్నారు. శుక్రవారం సెంటిమెంట్‌తో గురువారం ఉదయం, మధ్యాహ్నం నుంచే ప్రయాణాలు మొదలయ్యాయి. పండుగకు ముందే స్వస్థలాలకు వచ్చిన ఉద్యోగు లు సెలవులు పూర్తి కావడంతో కొంతమంది పయనమయ్యారు. మరికొందరు రెండు రోజులు సెలవులు పొడిగించుకుని శని, ఆదివారాల్లో ప్ర యాణానికి సమాయత్తం అవుతున్నారు. స్వగ్రా మాలకు ముందస్తు రిజర్వేషన్లతో వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో బస్సు, రైళ్లు, ప్రైవేట్ సర్వీసుల రద్దీతో ఇబ్బంది పడుతున్నారు. శుక్ర వారం కొంత రద్దీ తగ్గినా శని, ఆదివారాల్లో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.



కిటకిటలాడిన బస్ స్టేషన్లు

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు గురువారం సా యంత్రం నుంచి కిటకిటలాడాయి. ఎవరిని చూ సినా నాలుగేసి బ్యాగ్‌లతో ఉన్నారు. వచ్చినప్పుడు రెండు బ్యాగ్‌లు ఉండగా వెళ్లేట ప్పుడు మరో రెండు బ్యాగ్‌లు తోడయ్యాయి. బం ధువులు ఇచ్చిన పిండివంటలు తమ పొలంలో పండిన పంటలు, పండ్లను తీసుకుని వెళ్లారు. ఏలూరు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ పవర్ పేట, ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, నూజివీడు రైల్వే స్టేషన్, జంగారెడ్డి గూడెం, కామవరపుకోట, జీలుగుమిల్లి, చింతలపూడి, నూజివీడు, గుండు గొలను సెంటర్, భీమడోలు, కైకలూరు బస్టాండ్‌లు కిటకిటలాడాయి. ఏలూరు, నూజివీడు, జం గారెడ్డిగూడెం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తమ ప్రయాణాన్ని కొనసాగిం చడంతో బస్సులు అన్నీ నిండిపోయాయి. రైళ్లు కూడా రద్దీగానే ఉన్నాయి. ప్రైవేటు బస్సుల నిర్వాహ కులు గుట్టు చప్పుడు కాకుండా అధిక ధరలు వసూలు చేస్తూ ప్రయాణికులను ఎక్కించుకుని తీసుకువెళ్తున్నారు. ముందుగానే టిక్కెట్లు లేవం టూ చెప్పి బస్సు వస్తే ఖాళీ ఉంటే ఎక్కిస్తామం టూ ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. ఆ విధంగా అయినా డబ్బులు తీసుకుని గురువారం రాత్రి జిల్లాలో ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు యథేచ్ఛగా ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేశారు. దీంతో వారంతా దిక్కు తోచని పరిస్థితిలో ప్రయాణాన్ని కొనసాగిం చుకోవాల్సి వచ్చింది.

బాల్య వివాహాల నిరోధంపై ప్రచారం

నూజివీడు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యో తి): పొలసానపల్లిలో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండే షన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధంపై ప్రచారం నిర్వహించారు. బాలలకు వివాహం చేయడం చట్టరీత్యా చర్య లు తీసుకుంటారని క్రాప్‌జిల్లా కో ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్, ఏఎన్ఎమ్ కల్యాణి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు వివరించారు.

బలివే ఉత్సవాల ఏర్పాట్లకు బహిరంగ వేలం

ముసునూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహ శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు చేయడానికి బహి రంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. విద్యుత్ దీపాలంకరణ, మైక్‌సెట్స్, షామియానా సప్లై, లడ్డు తయారీ, ప్రసాద పచారి సామగ్రి, భోజన ఫలహారాలు సప్లైయి, క్యూలైన్‌ల ఏర్పాటుకు సరుగుబాదుల సప్లైయి, మహాశివరాత్రి రోజు వి విధ రకాల పనులు నిమిత్తం కూలీల సప్లై కోసం ఈనెల 22న టెండర్ వేలం జరుగు తుం దని, 21 వరకు ఆలయ కార్యాలయం వద్ద టెం డర్ ఫారం ఇస్తామ న్నారు. టెండర్ బాక్స్‌లో వేసి తదుపరి రోజు వేలంలో పాల్గొనాలన్నారు.

మానవత్వం చాటిన మంత్రి పార్థసారథి

▸▸ గాయపడిన మహిళను కాన్వాయిలో ఆసుపత్రికి పంపిన వైనం

ఏలూరు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన మహిళను సమీపంలోని ఆసుపత్రికి పంపించి మానవత్వాన్ని చూపించారు. గురువారం ఏలూరులో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం ముగించుకొని విజయవాడకు తిరిగి వెళ్తుండగా జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడూరుపాడుకు చెందిన కె.శిరీష తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో హైవేపై వెళుతున్న మంత్రి ప్రమాదాన్ని చూసి కాన్వాయ్‌ని ఆపి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. వెంటనే మరో వాహనంలో సమీపంలోని పిన్నమనేని ఆసుపత్రికి తీసుకుని వెళ్ళి వైద్యం చేయించమని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మహిళకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో శిరీష తల్లి కూడా స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంపై మంత్రి స్పందించిన తీరుకు హైవేపై ప్రయాణిస్తున్న పలువురు మెచ్చుకున్నారు.



ప్రమాద ఘటన వద్ద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి





మావుళ్లమ్మ ఉత్సవాల్లో అలరించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు

వైభవంగా మావుళ్లమ్మ ఉత్సవాలు

భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరు గుతున్నాయి. అమ్మవారి దర్శనార్థం గురువారం భక్తులు క్యూ కట్టారు. ఉదయం నుంచి భక్తుల తాకిడి కనిపించింది. సాయంత్రం 6 గంటల తరువాత ఇతర ప్రాంతా ల భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. రాత్రి వేళ ఆలయ కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు చేసిన ప్రత్యేక నృత్యా లు ఆకట్టుకున్నాయి. కాంతారా, కాంచన వంటి నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి సంకీర్తనలు, సా యంత్రం పిప్పళ్ళ ప్రసాద్ ఆధ్యాత్మిక సంకీర్తన, రాత్రి 9 గంటలకు విజయదుర్గా నాట్యమండలి మాయాబజార్ నాటకం ప్రదర్శించారు.





సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు.. నృత్య ప్రదర్శన

కలిదిండిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటయ్యేనా?

కలిదిండి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పట్టణంలో ఫైర్ స్టేషన్ లేకపోవటంతో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీవ్రంగా ఆస్తి, ప్రాణనష్టాలు వాటిల్లుతున్నాయి. లంక గ్రామాల్లో ఇటీవల తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కైకలూరు ఫైర్ స్టేషన్ నుంచి ఫైరింజన్ సిబ్బంది సంఘటన ప్రదేశానికి వచ్చే సరికి ఇళ్లు పూర్తిగా దగ్ధమై బాధితులు కట్టుబట్టలతో ఉంటున్నారు. కలిదిండిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల 10 కిలోమీటర్ల లోపు



గ్రామాలు ఉండటంతో సకాలంలో ఫైరింజన్ సిబ్బంది సంఘటన ప్రదేశానికి వెళ్లి మంటలను అదుపు చేయటానికి అవకాశం ఉంటుందని బాధితులు అంటున్నారు. వైసీపీ హయాంలో కలిదిండిలో ఫైరు స్టేషన్ ఏర్పాటు చేస్తామని పలుమార్లు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో కైకలూరులో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలిదిండిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కలిదిండిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రథం ముగ్గులతో సంక్రాంతికి వీడ్కోలు

ముదినేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ముగింపు రోజు సందర్భంగా ముక్కనుమ రోజైన గురువారం మహిళలు తమ గృహాల ముందు రథం ముగ్గులు వేసి పండుగకు వీడ్కోలు పలికారు. వివిధ రకాల రంగులతో రథం ముగ్గులను తీర్చిదిద్ది ముగ్గులతో రథాన్ని లాగినట్లుగా వేసి దగ్గరలోని పంట కాల్వల్లో కలపి కాల్వల ఒడ్డున సంక్రాంతి లక్ష్మీకి పూజలు జరిపారు. మళ్లీ ఏడాదికి వస్తామంటూ గంగిరెద్దుల వాళ్లు గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు.



ముదినేపల్లిలో ఓ గృహం ముందు రథం ముగ్గు

ముదినేపల్లి బస్‌స్టేషన్‌లో సమస్యల తిష్ఠ

తాగునీరు లేదు.. టాయిలెట్స్ కంపు.. ముళ్ల పొదలతో నిండిన పరిసరాలు

ముదినేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ఆర్టీసీ బస్ స్టేషన్ సము దాయం సమస్యల నిలయంగా ఉంది. సుమారు 37 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు సంస్థ అధికారులు పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. మౌలిక సదుపాయాలు అరకొరగానే ఉన్నాయి. సరైన రహదారి సౌకర్యం లేదు. మెయిన్ రోడ్డు నుంచి ప్రయాణికులు బస్ స్టేషన్‌లోకి రావటం ఇబ్బందికరంగా ఉంది. కూర్చునేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ బెంచీలు తుప్పు పడుతున్నాయి.



పాడుబడిన భవనంలా ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్ సముదాయం



మూతబడిన తాగునీటి సిస్టమ్

తాగునీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్ల సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది. కంపుకొడుతు న్నాయి. వాటిని వినియోగించేందుకు ప్రయాణికులు ఎక్కువ శాతం మంది అసౌకర్యంగా ఫీలవుతున్నారు. తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వాటర్ సిస్టమ్ చాలా సంవత్సరాల క్రితం మూతబడింది. బస్ స్టేషన్‌లో దుకాణాల సముదాయం నిర్మించినప్పటిక ఎప్పుడూ మూతబడే ఉంటాయి. బస్ స్టేషన్ పరిసరాలు ముళ్ల చె ట్లతో నిండిపోవటంతో పాములు కూడ ప్రాంగణంలోకి వస్తున్నాయి. బస్ స్టేషన్ భవనంపై పెరుగుతున్న మొక్కలు భవనాన్ని బీటలు వారుస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవటం లేదు. బస్ స్టేషన్‌లో బస్‌ల రాకపోకల వేళల పట్టికను కూడ ఏర్పాటు చేయకపోవటంతో ప్రయాణికులకు ఎప్పుడు ఏ ఊరు బస్సు వస్తుందో తెలియటం లేదు.

సౌకర్యాలు ఏర్పాటు చేయాలి



ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. తాగునీరు, టాయి లెట్స్ సౌకర్యాలు మెరుగుపర్చాలి.

– అడుసుమిల్లి సాయి కృష్ణ, పెయ్యేరు



మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ డాక్టర్ రాజ్యలక్ష్మి

మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ (క్లాసిక్ విభాగం) కిరీటం నూజివీడుకు చెందిన దంత వైద్యురాలు వై.రాజ్యలక్ష్మి సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 12న ఆమె టైటిల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మితో ఆంధ్రజ్యోతి ముఖాముఖి.

● టైటిల్ గెలుచుకోవడం..?

మహిళలు ముందడుగు వేస్తూ ప్రతి రంగంలో విజయం సాధించినప్పుడే సమా జం ముందుకు వెళుతుంది. మహిళా సాధికారికత దిశగా పయనించాలి.

● సమాజ శ్రేయస్సుకు చేసే కృషి..

సమాజాభివృద్ధికి సనాతన ధర్మం దోహద పడుతుంది. సనాతన ధర్మాన్ని కాపాడిన ప్పుడే ఉమెన్ ఎంపవర్‌మెంట్ సాధ్యం. దీన్ని మెయిన్ థీమ్‌గా తీసుకుని మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ క్లాసిక్ విభాగంలో విజేతగా ఎంపిక కాగలిగాను.

● వైద్యురాలిగా.. అందాల పోటీలు.. ఎలా సమన్వయం చేయగలిగారు?

మహిళ కుమార్తెగా, చెల్లిగా, అక్కగా, భార్య, మాతృమూర్తిగా తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తుంది. ఆరోగ్యకర సమాజాన్ని ఏర్పరచడంలో మహిళ పాత్ర కీలకం. సీతాదేవిని ప్రేరణగా తీసుకుని అన్నిరంగాల్లో ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు సాగాలనే ఆలోచనే అటు వైద్యురాలిగా, ఇటు మోడల్‌గా విజయం సాధించేందుకు అవకాశం కలిగించింది.

● మున్ముందు మహిళాభివృద్ధి..?

మనది పూర్వం మాతృస్వామ్య సమాజం. ఇప్పుడు కూడా విద్య, వ్యాపారం, ఇతర రంగాల్లో దాదాపు సగభాగం మహిళల పాత్ర ఉంది. మిగిలిన రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది.

(నూజివీడు, ఆంధ్రజ్యోతి)



చిన్నంపేటలో వ్యవసాయ భూముల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న దళితులు

చిన్నంపేట దళిత కాలనీలో తాగునీటి ఇబ్బందులు

చాట్రాయి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండ లంలోని చిన్నంపేట, కోటపాడు రహదారిలో దళిత కాలనీ వాసులు తాగునీరు లేక అల్లాడు తున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న నీరు పైప్ లైన్స్ లీకేజీతో కలుషిత మవుతోంది. దూరంగా వ్యవసాయ భూముల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంటలకు మోటారు ద్వారా నీరు పెట్టుకున్న సమయంలోనే తాము నీరు తెచ్చుకునే అవకా శం ఉంటుందన్నారు. లేకుంటే తాగునీటి ఇబ్బం దులు తప్పవని వాపోయారు. అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం కలగ లేదని, దళితవాడలో బోరుబావి నిర్మాణం చేసి తాగు నీటి సమస్య తీర్చాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొమ్ము ఆనందం కోరారు.



తమ్ముగూడెంలో సాగులో ఉన్న సొరతోట

కూరగాయల సాగుతో రైతులకు లాభాలు

చాట్రాయి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగుతో లాభాలు వస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఆసక్తి కనబరుస్తు న్నారు. మండలంలో గతంలో కూరగాయ సాగు నామమాత్రం. కూరగాయల వినియోగం పెరిగి మంచి ధర రావడంతో రైతులు దీనిపై దృష్టి సారించారు. మండలంలో సొర, కాకర, దొండ, బెండ, వంగ బీర, తదితర కూరగాయల సాగు విస్తీర్ణం పెరిగింది. ఉద్యాన శాఖ ద్వారా కూరగాయలు పండించే రైతులకు రాయితీలు ప్రోత్సాహకరంగా ఉంది. చాట్రాయి, తుమ్మ గూడెం, కోటపాడు, చీపురుగూడెం తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో కూరగా యల సాగు విస్తరించింది. చాట్రాయి, విస్సన్న పేట, నూజివీడు, చింతలపూడి మొదలైన మార్కెట్లు నుంచి వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కూరగాయాలు కొనుగోలు చేస్తున్నారు. చీడ పీడల బెడద ఉన్నా, మిగతా పంటల కంటే కూరగాయల సాగు లాభదాయకంగా ఉన్నదని రైతులు అంటున్నారు.

నాటుసారా విక్రయదారులపై కేసు నమోదు

ముసునూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. చెక్కపల్లికి చెందిన తాళం సంపతరావును అదుపులోకి తీసుకుని 5 లీటర్లు, ముసునూరుకు చెందిన చెంగల నాగేంద్రరావు వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ముదినేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొరగుంటపాలెంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ముచ్చు వెంకయ్య కుటుంబానికి అమరా వతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె తరఫున తండ్రి డాక్టర్ మనోజ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు, దుస్తులు అందజేశారు.

పశువుల పాక దగ్ధం

కలిదిండి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురానికి చెందిన ఎం.శ్రీనివాస రావుకు చెందిన పశువుల పాక బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధ మైంది. పాకలో ఉన్న మూడు గేదెలు, ఆవుకు నిప్పంటుకుని తీవ్ర గాయాల వ్వటంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టా డుతున్నాయి. వీటి విలువ సుమారు లక్షా 50 వేల రూపాయలు ఉంటుందని బాధి తులు తెలిపారు. సర్పంచ్ గూడవల్లి శ్రీని వాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభ నేని శ్రీనివాస్ చౌదరి, పశువైద్యాధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.

జూదాల నిర్వహణపై 34 కేసుల నమోదు

రూ.36,200 నగదు స్వాధీనం

కైకలూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో జూదాలు నిర్వహించినవారిపై 34 కేసులు నమోదు చేసి రూ.36, 260 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపా రు. కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్లో 13 కేసులు నమోదు చేసి 31 మందిని అదుపు లోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12, 260 నగదు, ఆరు కోళ్ళు, ఆరు కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన ట్టు ఎస్ఐ వెంకటకుమార్ తెలిపారు. రూ రల్ పోలీసుస్టేషన్ పరిధిలో 21 కేసులను నమోదు చేసి 42 మందిని అదుపులోనికి తీసుకుని రూ.24 వేలు నగదు, 13 కోళ్ళు, 26 కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

యువకుడి అదృశ్యం

ముదినేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బంగారం తాకట్టు పెట్టిన సొమ్ముతో పండుగ రోజున ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు తిరిగి రాని ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామానికి చెందిన బత్తుల వీర హనుమాన్ (33) ఈ నెల 14న సంక్రాంతి పండుగ రోజున కైక లూరు వెళ్లి తన భార్య బంగారపు చైన్‌ను తాకట్టు పెట్టి సొమ్ములు తీసుకుని వెళా డు. అదే రోజు మధ్యాహ్నా ఆ యువకుడు పెదపాలపర్రు వెళ్లినట్లు తెలిసింది. అనం తరం హనుమాన్ ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం వెతి కినా ఫలితం లేకపోవడంతో గురువారం హనుమాన్ సోదరుడు శరత్ కుమార్ ముదినేపల్లి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు, పేకాటపై 14 కేసులు

నూజివీడు టౌన్, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడిపందేలు, పేకాట నిర్వహిస్తున్న వారిపై 14కేసులు నమోదు చేసి రూ.20వేలు నగ దును స్వాధీన పరుచుకున్నట్లు రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు తెలిపారు. 8 పేకాట కేసులు కాగా, 6 కోడిపందేల కేసులను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చెల్లనిచెక్కు కేసులో జైలు

నూజివీడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బాకీ నిమిత్తం చెల్లనిచెక్కు ఇచ్చిన ఒకరికి సంవత్సరం జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ నూజివీడు ఒకటో అదనపు జూని యర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు తీర్పు ఇచ్చారు. కర్రే విజయలక్ష్మి దగ్గర 2020లో దయాల కుమారి రూ.10 లక్షలు అప్పుగా తీ సుకుంది. బాకీ చెల్లించాలని విజయలక్ష్మిని కోరగా ఇచ్చిన చెక్కు బ్యాంకులో నగదు లేద ని తిప్పి పంపారు. విజయలక్ష్మి నూజివీడు కోర్టును ఆశ్రయించగా దాయల కుమారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మాజీ సర్పంచ్ అనుమానాస్పద మృతి



కలిదిండి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో మాజీ సర్పంచ్ మృతి చెందాడు. సంతోషపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాల్వ నల్లయ్య (60) కొంతకాలంగా కలిదిండిలో నివాసం ఉంటున్నాడు. గురువారం సాయంత్రం సంతోషపురంలో చేపల చెరువు వద్దకు బైక్‌పై వెళ్లి తిరిగి కలిదిండి వస్తుండగా, పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ సమీపంలో రోడ్డు మలుపులో అనుమానాస్పదస్థితిలో తలకు గాయంతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. చికిత్స నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.